క్లుప్తంగా

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: డబుల్ బెడ్రూం రాని నిరుపేదలందరికి ఇళ్ల స్థలాలతో పాటు రూ.3 లక్షలను అందజేయాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ చైర్పర్సన్కి వినతిపత్రం ఇచ్చారు. ఇళ్లు లేని నిరుపేదలు చాలామంది ఉన్నారని వారందరికీ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇంటి స్థలంతో పాటు ఆర్థికసాయం అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రాలో ఇళ్లు రాని పేదలందరి విషయం గురించి మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లామని, ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం అందించేందుకు చర్యలు తీసుకుంటామని చైర్పర్సన్ తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్, సభ్యులు కోడం రమణ, గోవిందు లక్ష్మణ్, పోచమల్లు పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం అభివృద్ధి



ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు

ముస్తాబాద్: ప్రధాని మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కోల కృష్ణ అన్నారు. పోతుగల్లో ఇంటింటికి బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్ ఆదివారం నిర్వహించారు. గడిచిన తొమ్మిదేళ్లలో బీజేపీ కేంద్ర ప్రభుత్వ పాలనలో సర్వతోముఖాభివృద్ధి సాధించామన్నారు. ప్రపంచ దేశాల్లో భారత్ అభివృద్ధి ముందు వరసలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వరి వెంకటేశ్, కిట్టు పాల్గొన్నారు.

ఆలయంలో వాటర్ ట్యాంక్ ప్రారంభం



ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని శ్రీముత్యాల పోచమ్మ ఆలయంలో ఆదివారం ఆషాఢ ఉత్సవాల సందర్భంగా వాటర్ ట్యాంక్, నేమ్ బోర్డును ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అంకారపు అనిత మాట్లాడుతూ కట్ట మైసమ్మ ఆలయ కమిటీ, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కోడి అంతయ్య, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపెల్లి ఆనందం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజన్న, నాయకులు పాల్గొన్నారు.

ప్రయాణం ప్రాణసంకటం

- ప్రమాదకరంగా కల్వర్టులు
- అలంకారప్రాయంగా సూచిక బోర్డులు
- ఆర్అండ్బీ అధికారులు నిర్లక్ష్యం

చందుర్తి: వేములవాడ–కోరుట్ల ప్రధాన రహదారిలో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఐదారేళ్లుగా తరుచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ఈ ప్రాంతాలను డేంజర్ జోన్లుగా గుర్తించి బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నా స్పందన లేకుండాపోయింది. గడిచిన ఆరు మాసాల్లో ఈ రోడ్డుపై ఆరుగురు మృతి చెందగా, 20 మందికి పైగా గాయాలపాలై మంచాన పడ్డారు.



మల్యాల గ్రామ శివారులో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు



ఆశిరెడ్డిపల్లె వద్ద ప్రమాదకర మూలమలుపు



మర్రిగడ్డ శివారులో కల్వర్టును ఢీ కొట్టిన గూడ్స్ ఆటో (ఫైల్)

ఆర్అండ్బీ అధికారుల నిర్లక్ష్యం

ఈ ప్రధాన రహదారిలో మూడపల్లి–లింగంపేట వరకు మర్రిగడ్డ నుంచి జోగాపూర్, కిష్టంపేట, రామరావుపల్లె, సనుగుల వరకు, మూడపల్లి నుంచి అనంతపల్లి, నర్సింగపూర్, ఆశిరెడ్డిపల్లె, తిమ్మాపూర్, రామన్నపేట, చందుర్తి వరకు, హన్మాజీపేట నుంచి ఎన్గల్, బండపల్లి గ్రామం వరకు, నాలుగు రోడ్లు ఉన్నాయి. ఒక్క రోడ్డుకు కూడా సూచిక బోర్డులు లేవు. ఎప్పుడో 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన బోర్డులు వర్షాలకు తడిసి తుప్పు పట్టిపోయాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు రోడ్లపై ఎక్కడ ఏముందో తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేకాకుండా రోడ్డు పక్కనే పాఠశాలలు ఉన్న పాఠశాలల వద్ద సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

16 మూలమలుపులు

మూడపల్లి నుంచి లింగంపేట గ్రామం వరకు 16కు పైగా మూలమలుపు ఉన్నాయి. ఏ ఒక్క మూలమలుపు వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. దీంతో తరుచూ వీటి వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడపల్లి ఎక్స్రోడ్డు నుంచి రామన్న గ్రామం వరకు, మర్రిగడ్డ ఎక్స్ రోడ్డు నుంచి సనుగుల గ్రామం వరకు, హన్మాజీపేట ఎక్స్ రోడ్డు నుంచి ఎన్గల్, బండపల్లి, బావుసాయిపేట గ్రామం వరకు గ్రామాల వరకు గల మూలమలుపుల వద్ద ఎక్కడ సూచిక బోర్డులు లేవు. కొన్ని మూలమలుపులు దగ్గరకు వచ్చేంత వరకు కనబడకుండా ఉన్నాయి. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వెంటనే అధికారులు ఇప్పటికైనా రోడ్డు సర్వే చేసి వెంటనే సూచిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసి, ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



వేములవాడ కోరుట్ల ప్రధాన రహదారి మధ్యలో ఉన్న మూడపల్లి బస్టాండ్ వద్ద మూలమలుపు ప్రమాదంగా ఉంది. నాలుగు మాసాలుగా తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఐదుగురిపై మృతి చెందారు. సూచిక బోర్డును ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు.

– నీరటి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త, మూడపల్లి

రక్షణ గోడలు నిర్మించాలి



ప్రధాన రహదారి వెంట నిర్మించిన కల్వర్టులు వంకర టింకరగా నిర్మించడంతో అక్కడే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇరువైపుల కట్టిన రక్షణ గోడలు కూలిపోయాయి. మల్యాల కల్వర్టు వద్ద రోడ్డు ఎత్తువంపులుగా ఉండడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి.

– ఈసరి శ్రీనివాస్, యువకుడు, మల్యాల

త్వరలో పనులు చేయిస్తాం



మూల మలుపుల వద్ద, ముఖ్య కూడళ్లు, ఎక్స్ రోడ్లు, పాఠశాల గేట్ల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. ప్రమాదకర మలుపులు, రోడ్డు పక్క బావులు, తరుచు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పోలీసులు గుర్తించి నివేదిక ఇచ్చారు. త్వరలోనే టెండర్లు నిర్వహించి పనులు చేయిస్తాం.

– సతీశ్, ఆర్అండ్బీ, ఏఈ, చందుర్తి

నియామకం

బీఎస్పీ సిరిసిల్ల నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా రాజు



తంగళ్లపల్లి: మండలంలోని పద్మనగర్ గ్రామానికి చెందిన మేర్గు రాజు బీఎస్పీ సిరిసిల్ల నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వర్థవెల్లి స్వామిగౌడ్ ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్వామి గౌడ్ మాట్లాడుతూ డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్కుమార్ నాయకత్వంలో బీసీ వర్గాలను సంఘటితం చేస్తూ ముందుకెళ్లాలన్నారు.

పాలకేంద్రం అధ్యక్షుడిగా లింబాద్రి

వీర్నపల్లి: మండల కేంద్రంలో పాల కేంద్రం అధ్యక్షుడిగా దర్శనాల లింబాద్రిని పాల ఉత్పత్తిదారుల పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ కార్యక్రమానికి మండల సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, అగ్రహారం పాల శీతలీకరణ మేనేజర్ గట్టు రవీందర్, సూపర్వైజర్ నాగరాజు, పాలకవర్గ సభ్యులు కేశవేని దేవయ్య, లింబాద్రి, రామస్వామి, రాజేశం, అంజయ్య, నర్సయ్య, నర్సింగం, లింబయ్య, కార్యదర్శి చిదుర గణేశ్, పాల టెస్టర్ శేఖర్, సహాయకులు అబ్రహం పాల్గొన్నారు.

ముస్తాబాద్కు డిగ్రీ కళాశాల మంజూరు చేయాలి

ముస్తాబాద్: మండల కేంద్రానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కేకే యువసేన జిల్లా అధ్యక్షుడు అరుట్ల మహేశ్రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలన్నారు. ముస్తాబాద్, చుట్టుపక్కల గ్రామాల యువతీ యువకులు దూర ప్రాంతాలలోని పట్టణాలకు ఉన్నత విద్యకు వెళ్లలేక చదువులకు దూరం అవుతున్నారన్నారు. ప్రస్తుతం విద్య సంవత్సరం ప్రారంభమైన డిగ్రీ కళాశాల ఊసు లేదన్నారు. ఇప్పటికైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు.

పాడి కౌశిక్రెడ్డి దిష్టిబొమ్మ దహనం



ఇల్లంతకుంటలో..



వీర్నపల్లిలో..



రుద్రంగిలో..

ఇల్లంతకుంట/వీర్నపల్లి/చందుర్తి/గంభీరావుపేట/రుద్రంగి: ముదిరాజ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్రెడ్డి దిష్టిబొమ్మను ముదిరాజ్ కులస్తులు జిల్లాలోని ఆయా మండల కేంద్రాల్లో ఆదివారం దహనం చేశారు. డప్పుచప్పుళ్ల మధ్య దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. ఆయనను వెంటనే ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ సంఘం నాయకులు మండెపల్లి రవి, పిట్ల కాజిబాబు, జిబ్బర నాగరాజు, పని శివరామకృష్ణ, జంగిలి సురేశ్, శ్రీరాముల శ్రీనివాస్, ప్యాట్ల సతీశ్, పిట్టల రాజేశం, పిట్టల దేవయ్య, గామ రాజు, రాజేశ్, గండి నారాయణ, నేవూరి చెంద్రయ్య, బోయిని రాజు, రాగుల మహేశ్, పోగుల దేవయ్య, గంగాధర్, అశోక్, నర్సయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బోనాల సందడి



రుద్రంగిలో బోనాల ఊరేగింపు



అమ్మవారిని దర్శించుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు మనోహర్రెడ్డి

వేములవాడ మండలం రుద్రవరం, కోనరావుపేట మండలం మరిమడ్ల, ఇల్లంతకుంట, బోయినపల్లి మండలంలోని మల్లాపూర్, కొదురుపాక ఆర్అండ్ఆర్ కాలనీ, రుద్రంగి, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనంతో, డప్పుచప్పుళ్లు, బైండ్లోళ్ల ఆటపాటలతో పోచమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనం మొక్కులు చెల్లించారు. పిల్లా పాపలు చల్లగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పండాలని మొక్కుకున్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, డాక్టర్ గోలి మోహన్తో పాటు నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు.

– వేములవాడఅర్బన్/ఇల్లంతకుంట/కోనరావుపేట/బోయినపల్లి/రుద్రంగి

కానరాని దోభీఘాట్లు



గంభీరావుపేటలో నిరుపయోగంగా దోభీఘాట్

- నిర్వహణ లేక నిరుపయోగం
- చెరువులు, కుంటలే గతి
- ఇబ్బందిపడుతున్న రజకులు

గంభీరావుపేట: నిర్వహణ లేక, పట్టించుకునే వారు కరువైన గ్రామాల్లో దోబీఘాట్లు నిరుపయోగంగా మారుతున్నాయి. ఉన్న చోట వాటిని పట్టించుకోకపోవడం, లేనిచోట నిర్మించాలనే ఆలోచన రాకపోవడంతో రజకులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికీ ఇంకా గ్రామాల్లో చెరువులు, కుంటల్లోనే బట్టల ఉతికే పరిస్థితి నెలకొంది. దశాబ్దాల క్రితం నిర్మించిన దోభీఘాట్లు మాత్రమే ప్రస్తుతం ఉన్నాయి. కొత్తగా నిర్మించిన దాఖలేమి కనిపించడం లేదు. మండలంలో పదేళ్ల క్రితం మండల కేంద్రంలో, కొత్తపల్లిలో దోబీఘాట్లు నిర్మించారు. మల్లారెడ్డిపేటలో నిర్మించాల్సి ఉన్నా, నిర్మించలేదు. మండలంలో 21 గ్రామపంచాయతీలు ఉండగా దాదాపు 5 వేల మంది రజకులు ఉన్నారు. రెండు గ్రామాలు మినహా ఎక్కడ దోభీఘాట్ల నిర్మాణంగాని, వినియోగం కాని కానరావడం లేదు.


బోరు, మోటారు సౌకర్యం లేక

మండల కేంద్రంలోని నమాజ్ చెరువులో రజకులు బట్టలు ఉతికేందుకు దోబీఘాట్లు నిర్మించారు. ఇటీవల ట్యాంక్బండ్ పనుల్లో దోబీఘాట్ల కోసం ఏర్పాటు చేసిన బోరు రోడ్డులో మునిగిపోయింది. ప్రస్తుతం బోరు సౌకర్యం లేదు. దోబీఘాట్లు చెట్ల పొదల మధ్య కూరుకుపోయాయి. ఇటీవల స్వచ్ఛందంగా రజకులే కొంతమేర శుభ్రం చేసుకున్నారు. మండల కేంద్రంలో దాదాపు వంద రజక కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరు బట్టలు ఉతికేందుకు చెరువు నీరే దిక్కయ్యింది. బోరు సౌకర్యం కల్పించి తాత్కాలిక మరమ్మతు పనులు చేపడితే దోబీఘాట్లు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది.

శిథిలావస్థకు చేరిన దోబీఘాట్లు

మండలంలోని కొత్తపల్లిలో పదేళ్ల క్రితం నిర్మించిన దోబీఘాట్లు వినియోగంలో లేక పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన వాటిని వినియోగంలోకి తేవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. చొరవ చూపితే ఈ సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది. .

అన్ని గ్రామాల్లో నిర్మించాలి



మండలంలో రెండు, మూడు గ్రామాల్లోనే దోబీఘాట్లు ఉన్నాయి. అవి కూడా వినియోగించుకునే పరిస్థితిలో లేవు. ఏళ్ల నాటివి కావడం, వాటిని ఎవరు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అన్ని గ్రామాల్లో రజకుల కోసం దోబీఘాట్లు నిర్మించాలి.

– మహేందర్, రజక సంఘం మండల అధ్యక్షుడు

అన్నదానం



వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ ఆవరణలో ఆకలితో అలమటిస్తున్న అభాగ్యులకు మై వేములవాడ ట్రస్టు ప్రతినిధులు ఆదివారం వంద మందికి ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాగుల చంద్రశేఖర్, ప్రతాప నటరాజ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు గిఫ్ట్ ఏ స్మైల్ వాహనాలు అందజేయాలి

సిరిసిల్లటౌన్: గిఫ్ట్ ఏ స్మైల్లో భాగంగా ఎంపికైన దివ్యాంగులకు వాహనాలను అందజేయాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మంగళారపు రాజేందర్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిఫ్ట్ ఏ స్మైల్ అర్హుల జాబితా రూపొందించినా, పంపిణీ మధ్యలో నిలిచిపోయిందన్నారు. ఎంపికైన దివ్యాంగులందరికీ వాహనాలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు యెల్ల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి గణేశ్, రవి, మామిడాల నరేశ్, సంజీవ్, ఖాదర్ పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

తంగళ్లపల్లి: పద్మశాలీ కులస్తులకు బీసీ బంధు రూ.లక్ష పథకంలో అవకాశం కల్పించాలని డిమాండ్తో సోమవారం ఉదయం 10 గంటలకు సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ తంగళ్లపల్లి మండల కార్యదర్శి మంచికట్ల రమేశ్ కోరారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేయించుకుంటున్న జెడ్పీటీసీ

వీర్నపల్లి: మండల కేంద్రంలో రైతు వేదిక వద్ద ఆదివారం మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. గ్రామ సర్పంచ్ పాటి దినకర్ ప్రారంభించగా ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ మాలోతు భూల, జెడ్పీటీసీ గుగులోతు కళావతి, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం హాజరయ్యారు. శిబిరంలో 200 మందికి ఈసీజీ, షుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహించిన అవసరమైన వారికి మందులు అందించినట్లు ఆసుపత్రి పర్యవేక్షకుడు గుర్రం కిరణ్ తెలిపారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిరలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, అశ్విని హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 300 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్రావు శిబిరాన్ని సందర్శించి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వజ్రమ్మ, ఈఎన్టీ, న్యూరో, గైనకాలజిస్ట్, ఆర్థో విభాగం వైద్యులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ఐఎంఏ, సాయి అశ్విక ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో నర్సింగాపూర్ సర్పంచ్ జోగినిపల్లి ప్రేమ్సాగర్రావు, ప్రకాశ్రావు పాల్గొన్నారు.

నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన శివయ్యగారి నవీన్(29) కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్రెడ్డి డిమాండ్ చేశారు. బతుకుదెరువు కోసం దుబాయి వెళ్లిన నవీన్ అక్కడ గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ఆదివారం మహేందర్రెడ్డి పరామర్శించారు. నవీన్ కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షల ఆర్థిక సాయం చేయాలన్నారు. ఆయన వెంట డీసీసీ ఉపాధ్యక్షుడు షేక్గౌస్, నాయకులు లింగంగౌడ్, లక్ష్మారెడ్డి, దోమ్మాటి నర్సయ్య, బాబు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్ గ్రామానికి చెందిన చిన్ని వనజ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, ఆమె కుటుంబానికి కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్రెడ్డి ఆదివారం ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు రామిరెడ్డి, చిన్ని లక్ష్మారెడ్డి, బత్తుల నవీన్, రాజ్కుమార్, నక్కల రాంరెడ్డి, అనిల్, శ్రీను, ఓంకార్ పాల్గొన్నారు.

పరామర్శ

ఇల్లంతకుంట: మండలంలోని రేపాక గ్రామానికి చెందిన కోదాని పోచయ్య అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మృతుడి కుటుంబాన్ని సీపీఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆదివారం పరామర్శించారు. మృతుడు పోచయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట మల్లేశం, ఎల్లప్ప, పవన్, వెంకట్రెడ్డి, రూపేష్, ధర్మారెడ్డి, సంగెం మధు, జనార్దన్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ముస్తాబాద్: మండలంలోని తుర్కపల్లిలో బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచ్ కాశోల్ల పద్మ ఆదివారం పంపిణీ చేశారు.

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు 8, 9వ వార్డులలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. 8వ వార్డుకి చెందిన మెడుదుల భాగ్యలక్ష్మి, పోచంపల్లి స్వాతి, సత్రేంది భవాని, రాములు, 9వ వార్డుకి చెందిన తిప్పవరం సత్యనారాయణ, తాళ్ల సత్తవ్వ, శ్రీకాంత్, కొండపల్లి బుచ్చయ్యకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ జీల కిషన్యాదవ్, బీఆర్ఎస్ 8వార్డు అధ్యక్షుడు మెడుదుల దేవయ్య, నాయకులు సలేంద్రి బాలరాజ్, నీరటి శ్యామ్, వేణుగోపాల్, ర్యాకం అనిల్ పాల్గొన్నారు.

కళాకారులకు డప్పులు పంపిణీ

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్లో కళాకారులకు డప్పులు, గజ్జెలు ఆదివారం పంపిణీ చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గంభీరావుపేట ప్రశాంత్ సొంత ఖర్చులతో పలువురు కళాకారులకు డుప్పులు అందచేశారు.

మల్లాపూర్లో..

బోయినపల్లి: మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన బొల్లం ప్రతాప్రెడ్డి కుమారులు బొల్లం శ్రీపాల్రెడ్డి, జీవన్రెడ్డి గ్రామానికి చెందిన డప్పు కళాకారులకు డప్పులు పంపిణీ చేశారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ

వీర్నపల్లి: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ గ్రామసభ ఆదివారం సర్పంచ్ పాటి దినాకర్ అధ్యక్షత నిర్వహించారు. సర్పంచ్ మాట్లడుతూ గ్రామంలో 2020 నవంబర్ నుంచి 2023 మార్చి వరకు రూ.కోటి 23 లక్షల పనులు జరిగినట్లు తెలిపారు. ఎంపీపీ మాలోత్ భూల, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, ఎంపీటీసీ అరుణ్కుమార్, డీఆర్పీ అశోక్, ఉపసర్పంచ్ రవి పాల్గొన్నారు.